


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
ఎన్టీఆర్ కృష్ణా
మంగళవారం 22 జులై 2025 పేజీలు 8

## డ్రైనేజీ వ్యవస్థ నిర్వహణపై
# దృష్టిపెట్టండి



- మురుగునీరు సక్రమ పారుదలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి
- రోడ్లపై వర్షపు నీరు నిలిచే పరిస్థితి ఎక్కడా ఉండకూడదు
- ఇంజనీరింగ్ లోపాలు లేకుండా చూడాలి
- స్వచ్ఛత, సీజనల్ వ్యాధులపై ప్రజలకూ అవగాహన కల్పించాలి
- వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

(ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, జులై 21, మేజర్ న్యూస్)

వివరాలు 8లో



## రైతుల చిరకాల స్వప్నం
# ఎంపీ కృషితో సాకారం

- ముక్త్యాల ఎత్తిపోతల పథకానికి రూ.489.28 కోట్ల నిధులు మంజూరు
- ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- సీఎం చంద్రబాబు నాయుడు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మలకు కృతజ్ఞతలు తెలిపిన ఎంపీ కేశినేని శివనాథ్



**విజయవాడ బ్యూరో, జులై 21, మేజర్ న్యూస్ :** విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) కృషి ఫలితంగా రైతుల చిరకాల స్వప్నం సాకారం కానుంది. ఎన్నికల సమయంలో 2

## ఫొటోగ్రఫీ పోటీల ఎంట్రీలను
# ఈ నెల 31లోగా పంపండి

- ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం ఆగస్టు 19న పురస్కారాల ప్రదానం
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

వివరాలు 2 లో



# జీవన ఎరువులతో పంటకు బలం

- పచ్చిరొట్ట పైర్లతో 25 శాతం వరకు ఎరువులు ఆదా
- అన్నదాతలూ.. అవగాహన పెంచుకొని అడుగేయండి
- పెట్టుబడుల ఖర్చును తగ్గించి సాగును లాభసాటిగా మార్చుకోండి
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, జులై 21, మేజర్ న్యూస్ :** జీవన ఎరువులు వినియోగిస్తే 10 శాతం ఎరువులను ఆదా చేయొచ్చని.. అదేవిధంగా పచ్చిరొట్ట పైర్ల ఎరువులను వాడటం ద్వారా 25 శాతం ఎరువులను ఆదా చేయొచ్చని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, అధికారులతో కలిసి పచ్చిరొట్ట పైర్లు, జీవన ఎరువుల ప్రయోజనాలతో రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పచ్చిరొట్ట పైర్లతో నేలసారం పెరుగుతుందని, నేలలో పోషకాల వృధా తగ్గుతుందన్నారు. ఆరోగ్యకర నేల వల్ల ఆరోగ్యకర వ్యవసాయ ఉత్పత్తులు లభిస్తాయన్నారు. అదేవిధంగా రైజోబియం, అజోటోబాక్టర్, అజోస్పైరిల్లం, బ్లూగ్రీన్ ఆల్గే, అజోల్లా, మైకోరైజా వంటివి వాతావరణ నత్రజనిని మట్టిలో నిలిపి మొక్కకు ఉపయోగపడేలా చేస్తాయన్నారు. జీవన ఎరువులు వినియోగించేటప్పుడు వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకొని పాటించాలన్నారు. ఈ జీవన ఎరువుల కాలపరిమితి 6-12 నెలలు ఉంటుందని, రసాయనిక ఎరువులు, కీటకనాశకాలతో కలిపి వేయకూడదని, 2 లో..

(మొదటిపేజీ తరువాయి)

### రైతుల చిరకాల స్వప్నం ఎంపీ కృషితో సాకారం



సాగు,తాగు నీటి సమస్య పరిష్కారానికి ఇచ్చిన హామీ లో భాగంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, జిల్లా పార్టీ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ లను సమన్వయం చేసుకుంటూ ఎంపీ కేశినేని శివనాథ్ నిరంతర ప్రయత్నం వల్ల జగ్గయ్యపేట నియోజకవర్గం పరిధిలోని అన్నదాతల సాగునీటి కష్టాలకు ఎట్టకేలకు మోక్షం లభించనుంది. ముక్త్యాల ఎత్తిపోతల పథకం ఆయకట్టు పరిధిలో 38,627 ఎకరాల వ్యవసాయ భూమి వుంది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పంటల సాగుకి అవసరమైన సాగునీరు అందుబాటులో లేక రైతులు దీర్ఘకాలికంగా కన్నీటి కష్టాలను చవిచూస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వం వేదాద్రి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు స్థలాన్ని ముక్త్యాల నుంచి వేదాద్రికి మార్చి హడవుడిగా శంకుస్థాపన చేసి చేతులు దులుపుకుని రైతులను నట్టేట ముంచింది. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా జగ్గయ్యపేట నియోజకవర్గంలో పర్యటించిన కేశినేని శివనాథ్ కు స్థానిక నాయకులు, రైతులు తమ గోడు వెల్లబోసుకున్నారు. తాము పడుతున్న సాగునీటి ఇబ్బందులను శివనాథ్ దృష్టికి తీసుకువచ్చారు. తక్షణం స్పందించిన ఆయన ఎత్తి పోతల నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరుకి తన వంతు కృషి చేస్తానని అప్పట్లో హామీ ఇచ్చారు. ఎంపీగా ఘన విజయం సాధించిన తర్వాత పలుమార్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు లను కలిసి ముక్త్యాల ఎత్తిపోతల పథకం నిర్మాణాకి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎంపీ విజ్ఞప్తి కి సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం ఈ మేరకు రూ.489.28 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఎంపీ కేశినేని శివనాథ్ కృతజ్ఞతలు తెలుపుతూ ఈ మేరకు సోమవారం పత్రిక ప్రకటన విడుదల చేశారు.

### జీవన ఎరువులతో పంటకు బలం

నేలలో తగినంత తేమ ఉన్నప్పుడు వాడటం మంచిదని, ఈ అంశాలపై క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది అన్నదాతలకు అవగాహన కల్పించాలని, ఇందుకు పొలం పిలుస్తోంది కార్యక్రమాలను వినియోగించుకోవాలన్నారు. పెట్టుబడుల ఖర్చును తగ్గించుకొని సాగును లాభసాటిగా మార్చుకోవడంలో రైతులను చేయిపట్టి నడిపించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

## ఫొటోగ్రఫీ పోటీల ఎంట్రీలను ఈ నెల 31లోగా పంపండి

### ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం ఆగస్టు 19న పురస్కారాల ప్రదానం

### జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, జులై 21, మేజర్ న్యూస్ :** ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం (ఆగస్టు 19) సందర్భంగా విశేష ప్రతిభకనబరిచిన ఫొటోగ్రాఫర్లకు జిల్లాస్థాయిలో పురస్కారాలు ప్రదానం చేసేందుకు ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లు ఈ నెల 31వ తేదీ లోపు ఎంట్రీలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సోమవారం ఓ ప్రటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు ఉత్తమ న్యూస్ ఫొటో విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మొదటి విభాగం కింద జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు, స్వచ్ఛాంధ్ర/స్వచ్ఛ ఎన్‌టీఆర్, యోగాంధ్ర అంశాలకు సంబంధించి ఫొటో ఎంట్రీలు పంపొచ్చన్నారు. రెండో విభాగంలో తల్లికి వందనం/విద్య, ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్లు, దీపం - 2 ఉన్నాయని, మూడో విభాగంలో అత్యుత్తమ న్యూస్ ఫొటో పోటీ ఉంటుందన్నారు. ప్రతి విభాగంలో ప్రథమ (రూ. 10 వేలు), ద్వితీయ (రూ. 7,000), తృతీయ (రూ. 4 వేలు) బహుమతులతో పాటు రూ. 2 వేలు చొప్పున ఆరుగురికి ప్రోత్సాహక బహుమతులు అందించనున్నట్లు వివరించారు. ఒక ఫొటోగ్రాఫర్ ఒక సెక్షన్ నుంచి మూడు ఫొటోలు, అదేవిధంగా మొత్తం మూడు సెక్షన్ల నుంచి తొమ్మిది ఫొటోలు పంపవచ్చని, 2024, జూన్ 12 నుంచి 2025, జులై 31 మధ్య తీసిన ఫొటోలై ఉండాలన్నారు. ఫొటో సైజు 12%శ%10 ఉండాలని, ఫొటోలు ఎన్‌టీఆర్ జిల్లాలో మాత్రమే తీసి, పబ్లిసిటీకి మాత్రమే ఉపయోగించేవిగా ఉండాలని సూచించారు. ఒరిజినల్ ఫొటోలతో ఎంట్రీలను విజయవాడ గోపాల్‌రెడ్డి రోడ్డులోని రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహం ఆవరణంలో గల డీపీఆర్వో కార్యాలయంలో అందజేయాలని, ఇతర వివరాలకు 9121215373 నంబర్లో సంప్రదించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

# డ్రైనేజీ వ్యవస్థ నిర్వహణపై దృష్టిపెట్టండి







**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, జులై 21, మేజర్ న్యూస్ :** విజయవాడ నగర పరిధిలో డ్రైనేజీ వ్యవస్థపై దృష్టిపెట్టాలని, నిర్వహణ పరంగా ఎక్కడా లోపాలు ఉండటానికి వీల్లేదని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులకు స్పష్టం చేశారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నగరంలో క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించేందుకు కలెక్టర్ లక్ష్మీశ సోమవారం వివిధ ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేశారు. జిల్లాస్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమానికి ముందు పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డు, నిర్మల్ కాన్వెంట్ రోడ్డు, వన్‌టౌన్ లో బ్రిడ్జ్ ప్రాంతాలను పరిశీలించగా.. పీజీఆర్ఎస్ కార్యక్రమం ముగిసిన అనంతరం దేవీనగర్, న్యూ రాజరాజేశ్వరిపేట తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ పారిశుద్ధ్యం, సక్రమ మురుగునీటి పారుదల, రక్షిత తాగునీరు అనేవి ప్రజల ఆరోగ్య భద్రతకు చాలా కీలకమని డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకుంటే మురుగునీరు రోడ్లపైకి చేరడంతో దుర్వాసనతో పాటు దోమలు పెరిగి ప్రజలు డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వంటి విష జ్వరాల బారినపడే ప్రమాదముందన్నారు. వరద, మురుగునీటి కాల్వల్లో ఎక్కడా అడ్డంకులు ఉండటానికి వీల్లేదని, ఒకవేళ ఏదైనా సమస్య ఏర్పడితే యుద్ధప్రాతిపదికన సమస్యను సరిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కాలువ ప్రారంభం నుంచి చివరి వరకు పూడికలు అనేవి లేకుండా చూడాలన్నారు. అదేవిధంగా వర్షపు నీరు కూడా ఎక్కడా రోడ్లపై నిలిచిపోకుండా చూడాలని, వాహనదారులకు ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశిం చారు. నగర రహదారుల్లో ఇంజనీరింగ్ లోపాలు లేకుండా చూడాలన్నారు. ఈ వర్షాకాలంలో ఎక్కడైనా నీళ్లు నిలిచినా, డ్రైనేజీ సమస్య ఉన్నా 91549 70454 నంబరుకు ఫోన్‌చేసి సమాచారమివ్వాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

**సామాజిక స్పృహే మనకు, మన కుటుంబానికి రక్ష:**

చెత్తాచెదారాన్ని, ప్లాస్టిక్ వస్తువులు వంటి వాటిని కాలువల్లోకి నెడితే తిరిగి ఆ చెత్తే అంతులోని అనారోగ్యాల రూపంలో మన నెత్తినపడుతుందని.. వ్యర్థాలను సరైన విధంగా వేరుచేసి, పారిశుద్ధ్య సిబ్బందికి ఇవ్వడం, పాలిథీన్ కవర్లు వంటివాటిని వాడకుండా, ప్లాస్టిక్ వస్తువులకు ప్రత్యామ్నాయ వస్తువులను ఉపయోగించేలా అవగాహన కల్పించాలని, సామాజిక స్పృహ, క్రమశిక్షణ మనల్ని, మన కుటుంబాలను, సమాజానికి రక్ష అనే విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తించాలని పేర్కొన్నారు. ఆరోగ్య ఆంధ్ర సాకారానికి జరుగుతున్న మహా యజ్ఞంలో ప్రతిఒక్కరూ భాగం కావాలని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేయకుండా చూడాలని.. యజమానులకు నోటీసులు పంపి, మొక్కలు నాటేలా చూడాలని ఆదేశించారు.

కలెక్టర్ వెంట విజయవాడ నగరపాలక సంస్థ చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.సామ్రాజ్యం, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డా. అన్నపూర్ణ తదితరులు ఉన్నారు.

# స్ఫూర్తిదాయక మార్గదర్శకురాలు హేమలత



**చల్లపల్లి మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి ఫోర్ పథకంలో మార్గదర్శకురాలిగా తన పేరును నమోదు చేసుకుని నిరుపేద కుటుంబాన్ని దత్తత తీసుకున్న పారిశుధ్య కార్మికురాలు పల్లికొండ హేమలత స్ఫూర్తిదాయకురాలని అవనిగడ్డ నియోజకవర్గం ప్రత్యేక అధికారి పి.సాయిబాబు పేర్కొన్నారు. చల్లపల్లి మండలం,పురిటిగడ్డ కు చెందిన నిరుపేద వృద్ధురాలు చిర్ల కనికరమ్మ కుటుంబాన్ని దత్తత తీసుకొని ఆమెకు నిత్యావసర వస్తువులు అందించిన పురిటిగడ్డ ప్రాథమిక పాఠశాలకు చెందిన పారిశుధ్య కార్మికురాలు పల్లికొండ హేమలతను సోమవారం పురిటిగడ్డ పాఠశాలలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రత్యేక అధికారి సాయిబాబు మాట్లాడుతూ సమాజంలో నిరుపేదలకు సాయం అందించాలనే ఆలోచన ఉన్న ప్రతి ఒక్కరికి పి ఫోర్ పథకం మంచి వేదిక అని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు తోడుగా సమాజంలో సంపన్న కుటుంబాలు నిరుపేదలకు చేయూతనిస్తే ఆంధ్రప్రదేశ్ ను పేదరికం లేని రాష్ట్రంగా చేయవచ్చన్నారు. స్వచ్ఛంద సంస్థలు,దాతలు, రాజ కీయ నేతలు, ఉద్యోగులు ప్రతి ఒక్కరూ బిఫోర్ పథకంలో మార్గదర్శకులుగా భాగస్వామ్యం కావాలని సాయిబాబు పిలుపునిచ్చారు. తాను పేదరికంలో ఉన్నప్పటికీ తనకున్న దానిలో ఎంతో కొంత పేదలకు సేవ చేయాలనే ఆలోచనతో వృద్ధురాలిని దత్తత తీసుకున్న హేమలత ప్రశంసనీయురాలని అన్నారు. ఈ సందర్భంగా హేమలతను పూలమొక్క, దుశ్శాలువా తో సత్కరించి,ఆమెకు నూతన వస్త్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమణ,ఎంఈఓ పి.వెంకటేశ్వరరావు,సర్పంచ్ ఎం.రమ్య,ఎంపీటీసీ ఆర్. ఆకమ్మ,పంచాయితీ ఈవో శైలజ,ఉపాధ్యాయులు దేవరపల్లి సురేష్ బాబు,బి. నాగలక్ష్మి,గ్రామ ప్రముఖులు ఎన్.శివరామకృష్ణ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామీణ రోడ్లు నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టండి..

**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, జులై 21, మేజర్ న్యూస్ :** పంచాయతీరాజ్ రోడ్లు నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు రోడ్లు పై రాకపోకలను పూర్తిగా కట్టడి చేయాలని, ఓవర్ లోడ్‌తో తిరిగే రోడ్ల పైకి వాహణాల రాకపోకలు పూర్తిగా నిషేందించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. స్వరాంధ్ర 2047 దార్శనిక ప్రణాళికకు అనుగుణంగా దశల వారీగా లక్ష్యాలను సాధించేందుకు కలెక్టరేట్ ప్రాంగణంలో సోమవారం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇగ్నైట్ సెల్‌ను జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో పంచాయతీరాజ్ రోడ్ల నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రోడ్లు మరమత్తులకు గురికాకుండా అధికారులు ముందస్తు జాగ్రతలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా వరి నాట్లు వేసే సమయం ఆసన్నం కావడంతో రైతులు పంట పోలాలలో దుక్కిదున్నే ఏర్పాట్లు చేసుకుంటారన్నారు. ఈ తరుణంలో దమ్ము చక్రాల ట్రాక్టర్లతో దుక్కిదున్నడం జరుగుతుందని ఒక ప్రాంతం నుండి మరోక ప్రాంతానికి దమ్ము చక్రాలతోనే ట్రాక్టర్ యజమానులు రహదారులపై రాకపోకలను సాగిస్తున్నారన్నారు. ఇది పూర్తిగా నిషేదమని ఇటువంటి వాటి వలన రోడ్లు కోతకు గురై త్వరగా దెబ్బతింటాయని దమ్ము ట్రాక్టర్లు రోడ్లపై పై తిరగకుండా పూర్తిగా కట్టడి చేయాలన్నారు. రోడ్లు ప్రక్కన మొక్కలను నాటి సంరక్షణ భాధ్యతలను చేపట్టి రోడ్ల మార్జన్స్ దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అధిక బరువుతో



వాహనాలు రోడ్లపై తిరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. క్రాస్ రోడ్లు, మలుపులు, కల్వర్ట్ ల వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించేలా ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. రోడ్లు వెంట వాహనాల పార్కింగ్‌ను నివారించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ఇగ్నైట్ సెల్ సందర్శనలో కలెక్టర్ వెంట పంచాయతీరాజ్ ఈవో జెడ్.రమేష్, డీఈ కె.సరస్వతి, ఏఈలు వి.శ్రీనివాసరావు, ఎన్. శివరామకృష్ణ, ఈఏ పూర్ణశశాంక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికలో "72" ఫిర్యాదులు



విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ : సోమవారం పోలీస్ కమిషనర్ వారి కార్యాలయంలో ఎన్.టీ.ఆర్.జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఆదేశాలు మేరకు డి.సి.పి. ఏ.బి.టి.ఎస్.ఉదయారాణి "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"( పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం) కార్యక్రమాన్ని నిర్వహించి బాధితులు నుండి వివిధ సమస్యలకు సంబంధించి మొత్తం 72 ఫిర్యాదులపై భాదితులతో మాట్లాడటంతో పాటుగా, దివ్యాంగులు, వృద్ధుల వద్దకు నేరుగా వెళ్లి వారి సమస్యలు గురించి అడిగి తెలుసుకుని వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఫోన్ ద్వారా సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓలతో మాట్లాడి సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేయడమైనది. ఈ కార్యక్రమంలో డి.సి.పి. ఏ.బి.టి.ఎస్.ఉదయారాణి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొని ఫిర్యాదులు పరిష్కరించుటలో సహకారాన్ని అందించారు.

### ప్రతి ఫిర్యాదును శాశ్వతంగా పరిష్కరించాలి



విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ : ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు ప్రధాన



కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్ లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను అదనపు కమిషనర్ డాక్టర్ డి చంద్రశేఖర్ నిర్వహించారు. ప్రజలు తీసుకువచ్చిన ఫిర్యాదులను, శాఖధిపతులు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదుదారులకు తమ స్వయంగా వచ్చి పరిశీలించి శాశ్వతమైన పరిష్కారాన్ని తీసుకొచ్చే విధంగా చూస్తామని తెలియపరిచారు. ఈ సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 17 ఫిర్యాదులు అందగా అందులో పట్టణ ప్రణాళిక సంబంధించినవి 5, ఇంజనీరింగ్ 4, రెవెన్యూ సంబంధించినవి 3, వైద్య & ఆరోగ్యం 2, ఎస్టేట్ 2, హౌసింగ్ ఒకటి మొత్తం కలిపి 17 ఫిర్యాదులను అందుకున్నారు అధికారులు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ప్రాజెక్ట్ డాక్టర్ డి చంద్రశేఖర్ తో పాటు చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె అర్జునరావు, జాయింట్ డైరెక్టర్ అమృత్ డాక్టర్ కెబిఎన్ఎస్ లత, సూపరిండెంటింగ్ ఇంజనీర్లు పి. సత్యకుమారి,పి సత్యనారాయణ, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి సోమశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### మీకోసం ద్వారా వచ్చిన ఫిర్యాదులకు ప్రథమ ప్రాధాన్యత

జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు



మచిలీపట్నం మేజర్ న్యూస్ : ప్రజల సమస్యలను చట్టపరిధిలో విచారించి న్యాయం అందించడానికి కృష్ణాజిల్లా పోలీస్ శాఖ సిద్ధంగా ఉంటుందని సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు అన్నారు.సోమవారం మీకోసం కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి, వారి సమస్యను విని, సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేసి, వారి సమస్యను పరిష్కరించాలని సూచించారు.సమస్య తీవ్రత ఎలా ఉన్నా చట్ట పరిధిలో పూర్తిస్థాయి విచారణ జరిపి నిర్దిష్ట గడువు లోపల పరిష్కారం అందించడానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉంటామని తెలిపారు. సమస్యను గూర్చి చింతించకుండా ధైర్యంగా వచ్చి ఫిర్యాదు చేసి పరిష్కారం పొందవచ్చని ఎస్పీ ఫిర్యాదు దారులకు భరోసా కల్పించారు. సోమవారం మీకోసం కార్యక్రమానికి మొత్తం 42 ఫిర్యాదులు అందాయి.



# నిర్ధేశించిన సమయంలో అర్జీలను పరిష్కరించాల్సిందే..





విజయవాడ బ్యూరో, జులై 21, మేజర్ న్యూస్ : అర్జీదారుల సంతృప్తే లక్ష్యంగా అర్జీలకు పరిష్కరం చూపాలని, నిర్దేశించిన సమయం లో అర్జీలను పరిష్కరించాల్సిందేనని ఈ విషయంలో ఎటువంటి అలసత్వాన్ని ఉపేక్షించబోమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీదారుల నుండి స్వీకరించిన సమస్యలకు సంబంధించి అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీదారులు సంతృప్తి చెందాలనే లక్ష్యంతో అధికారులు సమస్యలను నిర్ధేశించిన సమయంలో పరిష్కరించాలని ఈ విషయంలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించిన ఉపేక్షించే ప్రశక్తే లేదని కలెక్టర్ అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే సమస్య పరిష్కారమవుతుందనే ఆశతో గ్రీవెన్స్ సెల్ను ఆశ్రయిస్తారన్నారు. వారి నమ్మకానికి బలం చేకూర్చే విధంగా నాణ్యతా ప్రమాణాలతో అర్జీలను పునరావృతం కాకుండా పరిష్కరించాలన్నారు. అర్జీలు ఎట్టిపరిస్థితులతో పెండిరగ్ ఉండరాదన్నారు. వ్యక్తిగత సమస్యలు ఎదురైనప్పుడు పడే ఇబ్బందులు పరిష్కరించుకోవాలనే తపన అధికారులకు ఎలా ఉంటుందో ప్రజలకు కూడా ఆదే విధమైన భావన ఉంటుందనే విషయాన్ని అధికారులు గుర్తుపెట్టుకుని సేవ చేస్తున్నాననే మానవతాదృక్పథంతో సమస్యల పరిష్కారం పై దృష్టిపెట్టాలన్నారు. సమోదైన అర్జీలకు సంబంధించి కిందిస్థాయి అధికారుల నుండి తగిన సమాచారాన్ని సేకరించి అర్జిదారులను సంతృప్తి పరచడమే ధ్యేయంగా ప్రభుత్వ లక్ష్యాన్ని నేరవేర్చాలన్నారు. అర్జీల పరిష్కారంపై తాను ప్రతి రోజు సమీక్షాన్నానని అర్జీల పరిష్కారంలో సరైన కారణం లేకుండా జాప్యం జరిగినా, నాణ్యత లేకున్నా చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

**169 అర్జీల స్వీకరణ:** రెవెన్యూ శాఖకు సంబంధించి 46, పోలీస్ శాఖకు 26, విద్య 23, ఏపిఎస్డబ్ల్యూఆర్ఐఎస్ 12, పంచాయతీరాజ్ 9, ఏపిసిపిడిసిఎల్ 8, పౌరసరఫరాలు 5, విభిన్న ప్రతిభావంతులు 5, డిఆర్డిఏ 5, ఎండోమెంట్స్ 5, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ 3, ఆర్ఐవో 3, ఆర్డబ్ల్యూఎస్ 3, హెల్త్ 2, సోషల్ వెల్ఫేర్ 2, సర్వే 2, వ్యవసాయం, పశుసంవర్ధక, కో – ఆపరేటివ్, అటవీ, జీఎస్డబ్ల్యూఎస్, హౌసింగ్, ఐసిడిఎస్, లీడ్ బ్యాంకు మేనేజర్, నైపుణ్యాభివృద్ధి, నీటివనరులు కు సంబంధించిన ఒక్కో అర్జీతో కలిపి మొత్తం 169 అర్జీలను స్వీకరించడం జరిగిందని కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్తో పాటు జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డిఆర్వో ఎం లక్ష్మీనరసింహం, డీఆర్డీఏ పీడీ ఏఎన్వి నాంచారరావు, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## పీఏసీఎస్ కమిటీ ప్రమాణస్వీకారంలో శాసనసభ్యులు కృష్ణప్రసాదు



జి కొండూరు మేజర్ న్యూస్ : పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమంలో మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు సోమవారం పాల్గొన్నారు. ఛైర్మన్గా కోయ నెహ్రూ, సభ్యులుగా రాగ చిన్న జమలయ్య, నడకుదిటి విఘ్నేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన త్రిసభ్య కమిటీని అభినందించారు. ఎమ్మెల్యే కృష్ణప్రసాదు మాట్లాడుతూ రైతులకు విశేషంగా సేవలను అందించాలని సూచించారు. వ్యవసాయ సీజన్ ఆరంభం నేపథ్యంలో రైతులకు ఎరువులు, విత్తనాలు సకాలంలో పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాల మేరకు రైతుల అభ్యున్నతి ప్రధాన ధ్యేయంగా కృషి చేయాలన్నారు. సొసైటీని ఆర్థికంగా మరింత బలోపేతం చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలకు తోడు సొసైటీ ద్వారా రైతుల శ్రేయస్సు కోసం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), ఎన్డీఏ కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల నుండి అందే అర్జీలను సకాలంలో పరిష్కరించాలి



మచిలీపట్నం మేజర్ న్యూస్ : ప్రజల నుండి అందే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి కే చంద్రశేఖర రావు జిల్లా అధికారులకు సూచించారు. సోమవారం ఉదయం నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు ఎస్పి సత్యనారాయణ, మెప్మా పీడీ సాయిబాబు, కె ఆర్ ఆర్ సి ఎస్ డి సి శ్రీదేవి, విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్ పోతురాజు తో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం నిర్వహించి వివిధ ప్రాంతాల ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. అంతకుమునుపు డిఆర్ఓ అధికారులతో సమీక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మీకోసం అర్జీల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని వాటిని సకాలంలో పరిష్కరించి ప్రజల్లో సంతృప్తి స్థాయి పెంచాలన్నారు.ఈసారి ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 10 సూత్రాల కార్యక్రమం పై శకటాలు రూపొందించేందుకు సంసిద్ధం కావాలన్నారు. ఐ గాట్ కర్మయోగి ఆన్లైన్ శిక్షణా తరగతులలో భాగంగా 15 కోర్సులు వచ్చే వారంలోగా ఉద్యోగులందరూ పూర్తి చేయాలన్నారు.రియల్ టైం గవర్నెన్స్ కింద జిల్లాలో ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో జారీ చేసే సర్కులర్లు, నోటిఫికేషన్లు, ఉత్తర్వులు, నియమాలు, నిబంధనలు తప్పనిసరిగా ఆన్లైన్లో అప్లోడ్ చేయాలన్నారు. పేదరికం నిర్మూలన ధ్యేయంగా చేపట్టిన పి 4 కార్యక్రమం సంబంధించి జిల్లాలోని 7 నియోజకవర్గాల్లో బంగారు కుటుంబాలు, మార్గదర్శిల విజయ గాధలను సిద్ధం చేయాలని ఆగస్టు 15వ తేదీనా విజయ గాధలను ఆవిష్కరించాల్సి ఉంటుందన్నారు.పచ్చిరొట్ట వాడకంపై గోడపత్రం ఆవిష్కరణ,పచ్చి రొట్ట పైర్లను వాడటం ద్వారా 25% ఎరువులు ఆదా అవుతాయని, పచ్చి రొట్టె ఎరువుతో మట్టికి జీవం వస్తుందని, నేల సారం పెంపుదలతో పాటు సాగు ఖర్చులు తగ్గిస్తుందని జీవన ఎరువులు వినియోగిస్తే 10% ఎరువులు ఆదా చేయవచ్చని తెలియజేస్తూ వ్యవసాయ శాఖ రూపొందించిన గోడపత్రాన్ని డిఆర్ఓ, అదనపు ఎస్పి కె ఆర్ ఆర్ సి ఎస్ డి సి వ్యవసాయ అధికారి మనోహర్, ఏడి మణిధర్ తదితరులు ఆవిష్కరించారు. వైద్య ఆరోగ్యశాఖ ప్రోత్సాహకాలు,ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ముగ్గురు అంతకుమించి పిల్లలు ఉన్న కుటుంబాలలో లక్కీ డిప్ ద్వారా ముగ్గురు ఎస్ నాగజ్యోతి, బొమ్మిడి నాగరాజు, ఎల్ లక్ష్మీపార్వతి లను ఎంపిక చేసి ఒక్కొక్కరికి ప్రశంసా పత్రము, 5 వేల రూపాయల చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతిగా డిఆర్ఓ అదనపు ఎస్పీ అందజేశారు.అలాగే పి పి ఐ యు సి డి, వేసక్టమీ అంగీకరించిన కుటుంబాలలో ముగ్గురిని గంటా పావని,యోగి కిరణ్, అనుములకొండ అనుపమ లను ఎంపిక చేసి వారికి ఒక్కొక్కరికి ప్రశంసా పత్రము, 5000 రూపాయలు నగదు బహుమతి ప్రోత్సాహకంగా డిఆర్వో,అదనపు ఎస్పి అందజేశారు. ఉత్తమ గైనకాలజిస్ట్ గా డాక్టర్ సుచిత్ర కు 8000 రూపాయలు, ఉత్తమ వ్యాసకటమి సర్జన్ గా డాక్టర్ హరి రంగ ప్రసాద్ కు 7వేల రూపాయలు, అధిక సంతానం కోసం పాటుపడి ఉత్తమ ప్రేరకులుగా నిలిచిన ఏఎన్ఎం బి వాణికి, ఆశ కార్యకర్త సిహెచ్ యమలీయమ్మ, శ్రీపతి దాలీ సుకన్య లకు ఒక్కొక్కరికి 2500 రూపాయల చొప్పున నగదు ప్రోత్సాహ బహుమతులు, ప్రశంసా పత్రాలు డిఆర్ఓ అదనపు ఎస్పి అందజేశారు.ఈ కార్యక్రమంలో జడ్పీసీఈఓ కే కన్నమ నాయుడు, డ్వామా, డి ఆర్ డి ఏ పి డి లు శివప్రసాద్, హరిహరనాదు, డీఎంహెచ్వో డాక్టర్ శర్మిష్ఠ, జిల్లా మత్స్యశాఖ అధికారి నాగరాజు, రహదారులు భవనాలు శాఖ ఈఈ లోకేష్, ఐ సి డి ఎస్ పి డి ఎం ఎన్ రాణి, ఉద్యాన అధికారి జే.జ్యోతి,మునిసిపల్ కమిషనర్ బాపిరాజు తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మద్యం, ఇసుక పాలసీలు అడ్డం పెట్టుకుని వేల కోట్లు దోచుకున్నారు




**జి.కొండూరు మేజర్ న్యూస్ :** ఒక్క అవకాశం అంటూ 2019లో అధికారం వచ్చిన జగన్మోహన్ రెడ్డిలా దోచుకోవాలో ముందుగానే ప్లాన్ చేసుకొని, దానికి తగ్గట్లుగా మద్యం, ఇసుక పాలసీలను నిర్ణయించి వేలాది కోట్ల రూపాయలు దోచుకున్నారని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నంలో సొసైటీ ప్రమాణస్వీకారం సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణప్రసాదు సోమవారం మీడియాతో మాట్లాడారు.ఆయన మాట్లాడుతూ మద్యం కుంభకోణం సుమారు రూ.3,500 కోట్లు ఉంటుందని ప్రాథమిక అంచనా వేస్తున్నారని కానీ దీనికంటే ఎక్కువ మొత్తంలో దోచుకుని ఉంటారని అభిప్రాయపడ్డారు. అక్రమంగా సంపాదించిన ఈ సొమ్ముతో విదేశాల్లో ఆస్తులను కొనుగోలు చేసి ఉంటారని పేర్కొన్నారు.గడచిన ఎన్నికల్లో ఒక్క మైలవరం నియోజకవర్గంలోనే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వాళ్ళు దాదాపు రూ.55 కోట్లకు పైగా ఖర్చు పెట్టారని వెల్లడించారు. ఇక్కడ పోటీ చేసిన అభ్యర్థి ఒక సామాన్య ఆసామి అన్నారు. నియోజకవర్గంలో ఓటుకు రూ.2వేలకు పైగా చెల్లించి ఇక్కడ ఓట్లను కొనుగోలు చేశారన్నారు. అలాగే ఉమ్మడి కృష్ణా జిల్లాలో గత ఎన్నికల్లో వైసీపీ దాదాపు 300 కోట్లకు పైగానే ఈ విధంగా ఖర్చు పెట్టిందన్నారు. ప్రజలు ఈ విషయాలన్నీ గమనించాలన్నారు.మద్యం కుంభకోణం కారణంగా కల్తీ మద్యాన్ని విక్రయించి దాదాపు వేలాది మంది మృత్యువాత పడ్డారని అన్నారు. ఇన్ని అక్రమాలు చేసి కూడా సాక్షి పత్రికలో పక్కదారి పట్టించే వార్తలు రాస్తున్నారని పేర్కొన్నారు. కూటమి నేతలందరూ ఐక్యమత్యంగా ఉండి 2029లో జగన్ అనే భూతాన్ని శాశ్వతంగా భూస్థాపితం చేయాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ సమావేశాల్లో కూడా ఈ అంశాన్ని లేవనెత్తాలని సూచించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు, ఈడీతో మద్యం, ఇసుక తదితర కుంభకోణాలపై సమగ్ర విచారణ జరిపించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా దీనిపై కఠినంగా వ్యవహరించి తగు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కృష్ణప్రసాదు విజ్ఞప్తి చేశారు. ఎన్డీఏ కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వ పాలనకు ప్రజల్లో విశేష ఆదరణ

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి పాలనకు ప్రజల్లో మంచి ఆదరణ లభిస్తోందని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు.జి.కొండూరు మండలంలోని కుంటముక్కల గ్రామంలో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో ఆత్మీయ పలకరింపుల మధ్య ఎమ్మెల్యే కృష్ణప్రసాదు సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి వెళుతూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఎమ్మెల్యే కృష్ణప్రసాదుకి ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం శాసనసభ్యులు కృష్ణప్రసాదు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా నియోజకవర్గంలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలయోగాక్షేమాలు తెలుసుకుంటున్నామన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఇప్పటికే చాలా అమలు చేశామని మిగిలిన హామీలు త్వరలోనే అమలు చేస్తామన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా కూటమి పాలన సాగుతోందన్నారు.కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న



సంక్షేమం, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు వివరాలను ప్రజలే మాకు చెబుతుండటం ఆనందదాయకమన్నారు. రానున్న నాలుగేళ్లలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రంలో మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ అక్కల రామ్మోహనరావు (గాంధీ), ఎన్డీఏ కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# నూతనంగా నిర్మించిన ఫార్మసీ కాలేజీకి స్వర్గీయ సావిత్రిబాయి పూలే నామకరణం చేయాలి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కృష్ణ విశ్వవిద్యాలయంలో నూతనంగా నిర్మించిన ఫార్మసీ కాలేజీకి స్వర్గీయ సావిత్రిబాయి పూలే నామకరణం చేయాలని ఉప కులపతి కూన రాంజీకి సోమవారం బీ.సీ సంక్షేమ సంఘం కృష్ణా జిల్లా అధ్యక్షులు శేకుబోయిన సుబ్రమణ్యం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కృష్ణ,ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల పరిధిలో ప్రభుత్వ ఫార్మసీ కాలేజ్ కృష్ణ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేయడం గర్వకారణం అన్నారు. కాబట్టి వెనుకబడిన తరగతులకు చెందిన,స్త్రీ విద్య కోసం ఎనలేని కృషి చేసి భారతీయ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయినిగా సావిత్రిబాయి పూలే గుర్తించబడ్డారని అన్నారు. ఆమె కృషి ఫలితంగా ఈరోజు దాదాపు 60 నుంచి 70 శాతం మంది స్త్రీలు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. కాబట్టి కృష్ణ విశ్వవిద్యాలయంలో నూతనంగా నిర్మించిన ఫార్మసీ కాలేజీకి సావిత్రి భాయ్ పూలే నామకరణం చేయాలని ఉపకులపతిని కోరినట్లుగా సుబ్రమణ్యం తెలియజేశారు. దీనిపై ఉపకులాపతి కూన రాంజీ సానుకూలంగా స్పందించారని సుబ్రహ్మణ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో నీక్కు రాధాకృష్ణ, కొండేటి మోహన్, ఎం.రామరాజు, అన్సారి, భోగి రెడ్డి సుభాని, పి.సాంబశివ, జోగి శివ, జన్ను గోవిందు, చేబోయిన కోటేశ్వరరావు తదితర బీ.సీ నాయకులు పాల్గొన్నారు.

# పట్టాభి భవన నిర్మాణానికి, నరసయ్య నాయుడు విగ్రహ ఏర్పాటుకు ఏకగ్రీవ తీర్మానం చేయండి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఆంధ్ర బ్యాంక్ వ్యవస్థాపకులు, జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా పనిచేసిన సీనియర్ పార్లమెంట్ సభ్యులు భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవన నిర్మాణాన్ని తక్షణమే నగర కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి అనుమతులు మంజూరు చేయాలని మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ డిమాండ్ చేశారు. సోమవారం బాలాజీ మీడియాతో మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు భవన నిర్మాణం కోసం 40 కోట్ల రూపాయలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని కేవలం స్థానిక రాజకీయాలతో భవన నిర్మాణానికి అనుమతి ఇవ్వకుండా కాలయాపన చేయడం సమంజసం కాదని అన్నారు. గౌరవ మేయర్, డిప్యూటీ మేయర్లు 50 మంది కార్పొరేటర్లు రాజకీయాలకు అతీతంగా నగర అభివృద్ధి ధ్యేయం గా భావించి తీర్మానాన్ని తక్షణమే ఆమోదించి అనుమతులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. హైకోర్టు లో భవన నిర్మాణం కోసం రిట్ పిటిషన్ దాఖలు చేసిన 45వ డివిజన్ ఇంచార్జ్ పీ.వీ ఫణికుమార్ వ్యాజ్యంలో కూడా రాష్ట్ర హైకోర్టు భవన నిర్మాణానికి అనుకూలంగా తీర్పు ఇచ్చిన విషయాన్ని కౌన్సిల్ సభ్యులు మర్చిపోకూడదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సిఫార్సు మేరకు జిల్లా కలెక్టర్, తాసిల్దారు రెండు ఎకరాలు స్థలాన్ని మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేసినా, భవన నిర్మాణానికి కావలసిన అనుమతులు మంజూరు చేయకుండా కాలయాపన చేయడం సమంజసమా? అని ప్రశ్నించారు. రాబోయే తరానికి మచిలీపట్నం గత చరిత్రను పట్టాభి సీతారామయ్య జీవిత చరిత్రను మ్యూజియం లోపల అందించడానికి వచ్చిన సువర్ణ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని కార్పొరేషన్ కార్యవర్గాన్ని కోరారు. స్వాతంత్ర సమరయోధుడు తోట నరసయ్య నాయుడు విగ్రహాన్ని కూడా తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పట్టాభి భవన నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయకపోతే చరిత్ర హీనులుగా మిగిలిపోతారని బాలాజీ హెచ్చరించారు. కొత్త కార్యవర్గం వచ్చే లోపు ప్రస్తుత కార్యవర్గం వారి పేరును ఇనుమడింపజేసేలా, అనుమతులు మంజూరు చేయాలని సూచించారు. నోబుల్ హైస్కూల్ విశ్రాంత ప్రధానోపాధ్యాయులు న్యాయవాది సువర్ణ రాజు, న్యాయవాది కమ్మిలి విజయకుమార్, సామాజిక కార్యకర్త మల్లంపల్లి వీరాంజనేయులు బాబు పాల్గొన్నారు




## పీ4 గ్రామ సభలో గోపు సత్యనారాయణ

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్టణం పరిధిలోని పీ4 గ్రామ సభలో కృష్ణ జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మెన్ గోపు సత్య నారాయణ పాల్గొన్నారు. సదరు గ్రామ సభలో ఇటీవల కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ4 సర్వేలో గల అభ్యాంతరాల నిమిత్తం వచ్చిన 100 పేర్లను తెలియ చేయడం జరిగింది ఈ సర్వేలో 5 అంశాలు అనగా కుటుంబంలో సంపాదించేవారు ఉన్నారా లేరా, మంచినీరు సరఫరా అందుబాటులో ఉందా లేదా, బ్యాంకు ఖాతా ఉందా లేదా, వంట గ్యాస్, విద్యుత్ సరఫరా ఉందా లేదా మొదలగు అంశాలను ప్రధానంగా తీసుకోవడం జరిగింది. సదరు గ్రామ సభలో జనసేన పార్టీ ఇంచార్జి దివి మహేష్, సెక్రెటరీ వెంకటేశ్వర రావు, బొమ్మిడి ఏడుకొండలు,పీత రాము, గోపు వెంకట రమణ, బోలిశెట్టి నాని, మోకా రాజు, బోట్ల రాజేష్, గమిడి ఈమ్మానుయేల్, జొన్నల లోకేష్, సచివాలయ సిబ్బంది,ఆశా వర్కర్స్, వెలుగు బుక్ కీపర్లు, అంగన్వాడీ టీచర్స్,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పేదలకు పాత బట్టలు పంపిణీ చేసి 'స్ఫూర్తి' గా నిలిచిన ఫౌండేషన్




**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఎవరికి ఏ కష్టం వచ్చినా అండగా మేమున్నాం అంటూ స్ఫూర్తి ఫౌండేషన్ ఎనలేని సేవలందిస్తోంది. సోమవారం స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమం చేపట్టింది. మీ పాత బట్టలు వేరొకరికి కొత్త బట్టలుగా ఉపయోగపడతాయి అనే నినాదంతో, నగరంలో, చుట్టుపక్కల ఉదారత గల దాతల వద్ద పాత బట్టలు సేకరించడం జరిగింది. వాటిని సోమవారం రైలు పేట స్లమ్ ఏరియా, దొంతులమ్మ గుడి దగ్గర స్లం ఏరియా ల్లో, 600 మందికి పైగా పేదలు, యానాదులకు, పంచిపెట్టడం జరిగింది. స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు అందించిన సాయానికి, పలువురు అభినందనలు తెలిపారు. నీలపాల ఫణి కుమార్, కె మణి బాబు, టి. నరేష్, గౌరీ శంకర్, సోమ శేఖర్,బనాల సుధాకర్, వి. స్వామి, నవీన్, నాగ బాబులు, పేదలకు బట్టల పంపిణీ కార్యక్రమం లో పాల్గొన్నారు. పేదలకు సాయం చేయాలనన ఉద్దేశంతో బట్టలు స్ఫూర్తి ఫౌండేషన్ కు అందించిన వారికి ఫౌండేషన్ సభ్యులు కృతజ్ఞతా పూర్వక ధన్యవాదాలు అందించారు.

## శ్రీ రంగనాయక స్వామి వారి దేవస్థానంలో శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవార్లకు ఆషాఢ మాస సరే



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం రాబర్ట్ సన్ పేటలో వేంచేసియున్న శ్రీ రంగనాయక స్వామి వారి దేవస్థానంలో సోమవారం ఆషాఢ మాసం సందర్భంగా దేవస్థానం వచ్చు భక్తులు మహిళలు శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవార్లకు ఆషాఢ మాస సరే సమర్పించారు. అనంతరం దేవాలయంలో దీపాలంకరణ పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ స్వామివారి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలు స్వీకరించారు అని దేవస్థాన కార్యనిర్వహణ అధికారి మగపాటి సత్య ప్రసాద్ బాబు తెలిపారు.



## వైసీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి



**తోట్లవల్లూరు జూలై 21 మేజర్ న్యూస్:** గ్రామాలలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పామర్రు మాజీ శాసన సభ్యులు కైలే అనిల్ కుమార్ విజ్ఞప్తి చేశారు. తోటవల్లూరు మండల పరిధిలోని బద్రిరాజు పాలెం కళ్యాణ మండపంలో నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. టిడిపి, కూటమి ప్రభుత్వం మోసాలను స్కాన్ చేసి ప్రజలకు ఎలా వివరించాలి అనే అంశంపై నాయకులు, కార్యకర్తలకు ఆయన అవగాహన కల్పించారు. ప్రతి ఒక్క కార్యకర్త, నాయకుడు ఈ విషయంలో అలసత్వానికి తావు లేకుండా కష్టించి పనిచేయాలని ఆయన పేర్కొన్నారు. అలాగే గత ఏడాదికాలంగా గ్రామాలలో జరుగుతున్న అవినీతిని, తెలుగుదేశం, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు చేస్తున్న అరాచకాలను వెలుగులోనికి తేవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావే శంలో మండల పరిధిలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## మొవ్వ సబ్ రిజిస్టార్‌గా దుర్గారాణి



**మొవ్వ (జులై 21) మేజర్ న్యూస్ :** మొవ్వ సబ్ రిజిస్టార్(డిప్యూటేషన్) గా కె. దుర్గారాణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నంది గామ సబ్ రిజిస్టార్ గా పనిచేస్తున్న దుర్గారాణి మొవ్వ సబ్ రిజిస్టార్ (డిప్యూటేషన్) గా బదిలీపై వచ్చారు. మొవ్వ సబ్ రిజిస్టార్ గా పని చేసిన ఎ. సత్యనారాయణను అక్రమ రిజిస్ట్రేష న్ ఆరోపణలపై ఫిబ్రవరి 28వ తేదీన రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు సస్పెండ్ చేసిన విషయం పాఠకులకు విధితమే. అయితే అప్పటి నుండి కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ గణేష్‌ను ఇన్చార్జి సబ్ రిజిస్టార్‌గా రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు నియమించారు. సస్పెన్షన్ గురైన సత్యనా రాయణ పై సస్పెన్షన్ రద్దుచేసి పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు సబ్ రిజి స్టార్ గా ఉన్నతాధికారులు పోస్టింగ్ ఇచ్చారు. దీంతో మొవ్వ సబ్ రిజిస్టార్ పోస్ట్ ఖాళీ అవడంతో దుర్గారాణిని మొవ్వ సబ్ రిజిస్టార్ గా రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు నందిగామ నుంచి మొవ్వకు డిప్యూటేషన్ పై బదిలీ చేశారు. సబ్ రిజిస్టార్ గా బాధ్యతలు స్వీకరించిన దుర్గారాణికి కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ గణేష్, జూనియర్ అసిస్టెంట్ మౌలాలి, షరాబు శాస్త్రి పలువురు సిబ్బంది, డాక్యుమెంట్ రైటర్లు స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

## బీజేపీ ఎన్టీఆర్ జిల్లా నూతన నియామకాలు





**జగ్గయ్యపేట జులై 21 మేజర్ న్యూస్:** ఎన్టీఆర్ జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్ నూతన ఎన్టీఆర్ జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యవర్గాన్ని నియ మించడం జరిగింది. జగ్గయ్యపేట నియోజకవర్గం నుంచి మరొకసారి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ప్రపుల్ల శ్రీకాంత్, కార్యదర్శిగా కల్లూరి శ్రీవాణి నియమించబడ్డారు, ఎస్సీ ఎస్టీ బీసీలకు సముచిత గౌరవం దక్కిందని భారతీయ జనతా పార్టీ తోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని మరొకసారి నిరూపించబడినది. నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ కార్యకర్తల్లో నూతన ఉత్సాహం నింపుతూ జగ్గయ్యపేట నియోజకవర్గానికి జిల్లాస్థాయిలో సముచిత గౌరవ దక్కిందని హర్ష వ్యక్తం చేస్తూ జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అదేవిధంగా వివిధ రాజకీయ పార్టీ పెద్దలు వీరికి అభినందనలు తెలియజేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు

## పనిచేయని ఫోన్లు రద్దు చేయాలి




**మొవ్వ (జులై 21) మేజర్ న్యూస్ :** పనిచేయని ఫోన్లను రద్దుచేసి వాటి స్థానంలో కొత్త ఫోన్లను అంగన్వాడీ కార్యకర్తలకు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకుల సంక్షేమ సంఘం మొవ్వ ప్రాజెక్టు శాఖ ఆధ్వర్యంలో సోమవారం సిడిపిఓ కార్యాలయం ఎదుట అంగన్వాడీ కార్యకర్తలు సహాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి కార్యకర్తలు సహాయకుల సమస్యలను సమస్యలను వెంటనే పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వం గర్భవతులు బాలింతలు మూడు సంవత్సరాల్లోపు చిన్నారులకు ముఖగుర్తింపు విధానాన్ని రద్దు చేయాలని ఇకేవైసీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు అనంతరం సిడిపిఓకి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు గౌరవాధ్యక్షురాలు విజయలక్ష్మి ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు దగాని రాజారత్నం తాతా శివకుమారి పద్మ, గంగాభవాని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి శీలం నారాయణరావు పలువురు సిఐటియు నాయకులు అంగన్వాడి కార్యకర్తలు సహాయకులు పాల్గొన్నారు.

# బాబు షూరిటీ - మోసం గ్యారంటీ



**కంచికచర్ల జూలై 21 మేజర్ న్యూస్ :** స్థానిక వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల పార్టీ నాయకులు,కార్యకర్తల తో నందిగామ మాజీశాసన సభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు సోమవారం సమావేశం అయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు అధికారం లోకి వచ్చేందుకు అమలు సాధ్యంకానీ హామీలివటం అధికారం లోకి వచ్చిన తరువాత విస్మరించటం వెన్నెతో పెట్టిన విద్యని దుయ్యబట్టారు.కూటమి ప్రభుత్వం అమలు చేసిన హామీలు,సంక్షేమ పథకాలు వివరాలను ప్రజలకు పూర్తిస్థాయిలో వివరించాలన్నారు. ముఖ్యంగా మండలం లోని అన్ని గ్రామాల పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం మోసాలను అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. ఎన్నికలకు ముందు కూటమి పార్టీలు ఇచ్చిన హామీలను నమ్మి ప్రజల పూర్తిగా మోసపోయారని మొండితోక అన్నారు. ఏడాది కాలంగా ప్రజలకు చేసిందేమీ లేకపోయినా సుపరిపాలన - తొలి అడుగు అంటూ ప్రజలను మరోసారి ఏ మార్చే యత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.సూపర్ సిక్స్ పథకాలను అదిగో చేస్తున్న ఇదిగో ఇస్తున్నామంటూ అసత్య ప్రచారాలు చేయటం తప్ప ఒక పథకాన్ని కూడా సమర్థవంతంగా అందించిన దాఖలాలు లేవని ఎద్దేవా చేశారు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తే కూటమి ప్రభుత్వం మాత్రం ఇచ్చే అరకొర పథకాలను షరుతులు విధించి అనర్హులంటూ లబ్దిదారులను కుదిస్తుందన్నారు.వారి మోసాలను ప్రజలు గమనిస్తున్నారని రానున్న కాలంలో బుద్ధి చెప్పడం ఖాయమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం లో మండల,పట్టణ పార్టీ అధ్యక్షులు జడ్పీటీసీ,ఎంపీపీ,ఎంపీటీసీ లు, సర్పంచ్ లు పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పింఛన్లు మంజూరైనా లబ్ధిదారులకు ఇవ్వని వైనం



**పామర్రు జులై 21 మేజర్ న్యూస్ :** తమకు నూతన పింఛను మంజూరు చేసి ఎప్పుడు ఇస్తారంటూ పలువురు ఒంటరి మహిళలు అధికారులను నిలదీసిన సంఘటన పామర్రు మండల పరిధిలోని పెదమద్దాలి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పెదమద్దాలి గ్రామంలో పి4 కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్రామసభలో పలువురు ఒంటరి మహిళలు తమ గోడును విన్నవించారు. తమ భర్తలు చనిపోయి సంవత్సర కాలం గడుస్తున్న నేటి వరకు తమ చేతికి పింఛను అందలేదని వాపోయారు.అలాగే పలువురు మహిళలు తాము ఒంటరితనంతో ఉంటున్నామని తమకు పింఛను మంజూరు చేయడంలో కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని అర్హతలు ఉన్న వారికి పెన్షన్ ఎందుకు రావడం లేదు తాను పరిశీలిస్తానని ఈ సందర్భంగా ఎండిఓ కె.జ్యోతి వారికి హామీ ఇచ్చారు. అనంతరం గ్రామ పంచాయతీ సిబ్బందిని వారి పింఛన్ల గురించి ప్రశ్నించగా వారికి వచ్చిన పింఛన్‌ను తిరిగి ఎండిఓ కార్యాలయంలో అందజేశామని సమాధానం ఇచ్చారు. దీంతో తమకు పింఛన్ ఎప్పుడు ఇస్తారో చెప్పాలని, తమకు మంజూరైన పింఛను తిరిగి కార్యాలయంలో జమ చేయడం ఏమిటని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఎండిఓ, పంచాయతీ కార్యదర్శి, గ్రామ సర్పంచి ఎవరు సరైన సమాధానం ఇవ్వకపోవడంతో ఈ ప్రభుత్వంలో ఒంటరి మహిళలకు రక్షణ లేదా అంటూ అధికారుల తీరుపై విరుచుకు పడ్డారు. ఒంటరిగా నివసిస్తున్న తమకు ప్రభుత్వం నుండి అందాల్సిన పింఛన్లు కూడా ఇవ్వకుండా అధికారులు ఇబ్బంది పెడుతున్నారని తమకు రక్షణ ఎలా అంటూ వారు తమ తీవ్ర ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. కాగా ప్రతినెల వేలాది రూపాయలు జీతం తీసుకుంటున్న అధికారులు బతుకుతెరువు కోసం 4,000 రూపాయల పింఛన్ కోసం అధికారుల చుట్టూ తిరిగినా వారికి కనీసం మానవత్వం లేకుండా పోతోందని ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు అధికారులు తీరుపై అసహనం వ్యక్తం చేశారు.

## నాటిన వరి నీట మునగకుండా అధికారులు స్పందించాలి.



**పెదపారుపూడి జులై 21 మేజర్ న్యూస్ :** ఈ ఏడాది పొలాలలో నాటిన వరి నీట మునగకుండా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు చేపట్టాలని పలువురు రైతులు అధికారులను కోరుతున్నారు. మండల కేంద్రమైన పెదపారుపూడి గ్రామ పడమటి పొలాలు గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నాటిన వరి పొలాలు నీట మునిగాయని పైనుంచి వచ్చే వర్షపు నీరు దిగువకు వెళ్లడానికి మార్గం సరిగా లేకపోవడంతో ఎక్కడ నీరు అక్కడే నిలిచి రైతుకు నష్టం చేకూరుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఒక ఎకరం పొలం దుక్కు దున్నటానికి, దమ్ము చేయటానికి, వరి నారు విత్తనాలు పోయడానికి, నాటు వేసే సమయానికి ఒక ఎకరానికి పదివేల రూపాయలు ఖర్చు అవుతోందని రైతులు తెలిపారు. వర్షపు నీరు గాని, పైనుంచి వచ్చే నీరు గాని నిల్వ ఉండకుండా క్రిందికి వెళ్లే మార్గం సుగమం చేసి రైతుల కళ్ళల్లో కన్నీరు లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులపై ఎంతైనా ఉందని రైతులు స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. అలాగే డ్రైన్లు గుర్రపు డెక్కతో నిండి ఉండి నీరు కిందకు దిగటం లేదని వెంటనే అధికారులు స్పందించి డ్రైన్ల లో ఉన్న గుర్రపు డెక్కను తొలగించాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ మాజీ సర్పంచ్, ప్రముఖ రైతు గారపాటి బాబురావు, పుసునూరి దుర్గాప్రసాద్, నగుళ్ల నాగేశ్వరరావు, అంగిరేకుల రామకృష్ణ, నాగనబోయిన ఆనందరావు, కొండపర్ల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## సొంత నిధులతో కాలువ తీత పనులను ప్రారంభించిన విప్ సౌమ్య



**నందిగామ, జులై 21, మేజర్ న్యూస్:** అనాసాగరం గ్రామ రైతుల విజ్ఞప్తిపై తక్షణ స్పందించి ఏపీ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తన సొంత నిధులతో కాలువ తీత పనులు ప్రారంభించారు. నందిగామ పట్టణం అనాసాగరం గ్రామంలో రైతులు తమ పంట పొలాలకు సాగునీరు అందించాలని చేసిన విజ్ఞప్తిపై ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య వెంటనే స్పందించారు. రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు తన సొంత నిధులతో అనాసాగరం-శనగపాడు సప్లై ఛానల్‌లో పూడిక తీత పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి తంగిరాల సౌమ్య స్వయంగా హాజరై, కొబ్బరికాయ కొట్టి పనులకు శ్రీకారం చుట్టారు.అనాసాగరం గ్రామ రైతులు ఎదుర్కొంటున్న నీటి ఎద్దడి సమస్యను గుర్తించిన తంగిరాల సౌమ్య సాగునీరు సకాలంలో పొలాలకు అందేలా చేయడానికి ఈ చొరవ తీసుకున్నారు. కాలువలో పేరుకుపోయిన పూడికను తొలగించడం ద్వారా నీటి ప్రవాహం సాఫీగా సాగి, రైతుల పంటలకు అవసరమైన నీరు అందనుంది. ఈ పనులు పూర్తయితే గ్రామంలోని వందలాది ఎకరాల పంట పొలాలు సాగునీటి సౌకర్యాన్ని పొందనున్నాయి.ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, "రైతులు అన్నదాతలు. వారి సమస్యలను వెంటనే పరిష్కరిం చడం మా ప్రభుత్వ బాధ్యత. అనాసాగరం రైతుల సమస్యను సొంత సమస్యగా భావించి, తక్షణ చర్యలు చేపట్టాము. ఈ పనులు త్వరగా పూర్తి చేసి, ప్రతి రైతు పొలానికి నీరు అందేలా చేస్తాము," అని హామీ ఇచ్చారు.గ్రామ రైతులు ఈ చొరవను స్వాగతిస్తూ, సౌమ్య సత్వర స్పందనకు కృతజ్ఞతలు తెలిపారు. "మా సమస్యను వెంటనే పరిగణనలోకి తీసుకుని, సొంత నిధులతో పనులు ప్రారంభించిన ఏపీ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే కి మా ధన్యవాదాలు. ఇది మాకు ఎంతో ఊరటనిచ్చింది," అని రైతులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, రైతు సంఘం నాయకులు, కూటమి నేతలు, అధికారులు పాల్గొన్నారు. ఈ పనులు త్వరలో పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. తంగిరాల సౌమ్య ఈ చొరవ గ్రామ రైతులకు కొత్త ఆశలను రేకెత్తించింది. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలో ఉన్న కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# స్మైల్ ట్రైన్ ఇండియా గుడ్‌విల్ అంబాసిడర్‌గా సినీ నటి పావని గంగిరెడ్డి



**విజయవాడ, జూలై 21, మేజర్ న్యూస్ :** గ్రహణం మొర్రి అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకొని స్మైల్ ట్రైన్ ఇండియా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల గుడ్‌విల్ అంబాసిడర్‌గా సినీ నటి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ పావని గంగిరెడ్డి నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో–అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓరియంటేషన్ కార్యక్రమంలో అధికారికంగా ప్రకటించారు. ఈ భాగస్వామ్యంతో ప్రపంచవ్యాప్తంగా గ్రహణం మొర్రితో బాధపడుతున్న వ్యక్తులు, ఆయా కుటుంబాలకు ధైర్యం ఇవ్వడానికి స్మైల్ ట్రైన్ ప్రారంభించిన ప్రపంచ క్లెఫ్ట్ అవగాహనా దినోత్సవం (జూలై 20) సందర్భంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్మైల్ ట్రైన్ ఇండియాతో చేతులు కలపడం గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు. గ్రహణం మొర్రితో బాధపడుతున్న పిల్లలతో మాట్లాడితే మనస్సు చలించిపోయిందన్నారు. గ్రహణం మొర్రి చికిత్స శారీరక ఆరోగ్యానికి మాత్రమే కాకుండా, ఆత్మవిశ్వాసానికి ఎంతో అవసరమని తెలుస్తుందన్నారు. ఈ అంశంపై మరింత అవగాహన పెంచేందుకు నావంతు ప్రయత్నం చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా స్మైల్ ట్రైన్ ఆసియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్, రీజినల్ డైరెక్టర్ మమతా క్యారల్ మాట్లాడుతూ పావనికి ప్రాంతీయంగా ఉన్న బలమైన అనుబంధం, ఆమెకు ఉన్న మానవీయ స్వభావం ఈ అంశంపై ప్రచారం చేయడంలో ఆమెను శక్తివంతమైన ప్రతినిధిగా నిలబెడతాయన్నారు. చికిత్స ఆలస్యమవడం వల్ల చాలా మంది తినడం, ఊపిరి పీల్చడం, మాట్లాడడం వంటి ప్రాథమిక విషయాల్లో ఇంకా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ ప్రచారం వల్ల నాణ్యమైన గ్రహణం మొర్రి చికిత్స ఉచితంగా అందుతోందన్న విషయం ఎన్నో కుటుంబాలకు చేరువవుతుందన్నారు. ఈ సందర్భంగా బసవతారకం ఇండో–అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసర్చ్ ఇన్‌స్టిట్యూట్ ప్లాస్టిక్ సర్జన్, స్మైల్ ట్రైన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ముఖుంద్ రెడ్డి మాట్లాడుతూ గ్రహణం మొర్రిపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. స్మైల్ ట్రైన్ వేసిన ఈ అడుగు సమాజంలో చురుకైన భాగస్వామ్యం, ముందస్తు జోక్యం, తగిన చికిత్స వంటి అంశాల్లో కొత్త దారులు తెరుస్తుందన్నారు. పిల్లలు ఎదుర్కొంటున్న సవాళ్లను వెలుగులోకి తీసుకురావడం, సమయానికి చికిత్స అందడం వల్ల కలిగే మార్పులను ప్రచారం చేయనున్నామని చెప్పారు. తెలంగాణలో 27,000 మందికి పైగా, ఆంధ్రప్రదేశ్‌లో 8,000 మందికి పైగా చిన్నారుల జీవితాలను స్మైల్ ట్రైన్ మార్చిందన్నారు. ఉచితంగా అందించిన గ్రహణం మొర్రి శస్త్రచికిత్స ద్వారా మార్గనిర్దేశం చేసిందన్నారు. ప్రతి రాష్ట్రంలో మూడు భాగస్వామ్య హాస్పిటల్స్ ద్వారా అందరికీ అందుబాటులో ఉండే నాణ్యమైన ఆరోగ్య సేవల వ్యవస్థను నిర్మిస్తోందని తెలిపారు. ముందుగా పావని గంగిరెడ్డి స్మైల్ ట్రైన్ అందిస్తున్న గ్రహణం మొర్రి చికిత్స గురించి వివరంగా తెలుసుకున్నారు. ఉచితంగా ఈ చికిత్స పొందిన చిన్నారులు, ఆయా కుటుంబాలతో సన్నిహితంగా మాట్లాడారు. గుడ్‌విల్ అంబాసిడర్‌గా పావని గంగిరెడ్డి స్మైల్ ట్రైన్ ఇండియా చేపడుతున్న అవగాహన కార్యక్రమాలలో పాల్గొంటారు. తల్లి–శిశు ఆరోగ్యం, గ్రహణం మొర్రి చికిత్సకు సంబంధించిన విభాగాల్లో అవగాహన పెంచేందుకు మద్దతు అందించనున్నారు.

# కూటమి ప్రభుత్వంలో సూపర్ సిక్స్ పథకాలు జెట్ స్పీడ్‌లో అమలు



**నందిగామ, జులై 21, మేజర్ న్యూస్:** సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా నందిగామ మండలం కంచల, గ్రామంలో ఇంటింటికి వెళ్లి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరించిన వీరంకి వీరాస్వామిన్ వివరించారు.త్వరలో పీ4 లింక్ ద్వారా మహిళలకు ప్రతి నెల రూ.1500 భృతిగత ప్రభుత్వ హయంలో రాష్ట్ర ప్రజలు సంక్షేమానికి, అభివృద్ధికి దూరంగా వున్నారు. అందుకే ఎన్డీయే కూటమి అధికారంలో రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంక్షేమం, అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి పెట్టారు. రాష్ట్రంలో లోటు బడ్జెట్ లో వున్న సంక్షేమం, అభివృద్ధి ప్రజలకు చేరువ చేయాలనే లక్ష్యంతో అధికారంలో రాగానే చెప్పిన విధంగా పెన్షన్ వెయ్యి రూపాయలు పెంచి ప్రతి నెల ఒకటో తారీఖు నాలుగు వేల రూపాయలు ఎన్డీయే కూటమి అందించటంతో పాటు సూపర్ సిక్స్ పథకాలు జెట్ స్పీడ్ లో అమలు చేస్తోందని వీరంకి శ్రీవీరాస్వామిన్ పేర్కొన్నారు., యొక్క కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రామిరెడ్డి శ్రీనివాసరావు, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు రామిరెడ్డి సుబ్బారావు,మందడపు వెంకటరావు, కస్తాల కిరణ్, బూత్ కన్వీనర్ చనమల వెంకట్రావు, రామిరెడ్డి గోపాల్, కుమ్మకూరిలక్ష్మయ్య,, గ్రామా తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# విజిటర్ రిజిస్ట్రేషన్స్ ప్రారంభించిన సెమీకాన్ ఇండియా

**విజయవాడ, మేజర్ న్యూస్ :** సెమీ, ఇండియా సెమీకండక్టర్ మిషన్ (ఐఎస్ఎం) సెమీకాన్ ఇండియా 2025 కొరకు విజిటర్ రిజిస్ట్రేషన్స్ ప్రారంభాన్ని ప్రకటించారు. తదుపరి సెమీకండక్టర్ పవర్ హౌస్‌ను నిర్మించడం ఈ ఈవెంట్ లో గ్లోబల్ సెమీకండక్టర్ ట్రెండ్స్, ఇండియా యొక్క స్థానిక ఎకోవ్యవస్థ అభివృద్ధి ప్రదర్శించబడతాయి. సెప్టెంబరు 2025, 2 నుండి 4 వరకు యశోభూమి (ఇండియా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ అండ్ ఎక్స్పో సెంటర్), కొత్త ఢిల్లీ వద్ద నిర్వహించాలని నిర్ణయించబడిన సెమీకాన్ ఇండియా 2025 కొరకు విజిటర్ రిజిస్ట్రేషన్ ను పరిశ్రమ భాగస్వాముల సహకారముతో సెమీ, ఐఎస్ఎం ప్రారంభించాయి. "తదుపరి సెమీకండక్టర్ పవర్ హౌస్‌ను నిర్మించడం" అనే ప్రధానాంశముతో, ఈ ఈవెంట్ మైక్రోఎలెక్ట్రానిక్స్, సెమీకండక్టర్ వాల్యూ చెయిన్ లో భారతదేశపు పెరుగుతున్న సామర్థ్యాలు, ఆకాంక్షలను ప్రదర్శిస్తుంది. సెమీకాన్ ఇండియా 2024 యొక్క అద్భుతమైన విజయం తరువాత, ఇండియా సెమీకండక్టర్ మిషన్, ఎలెక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజి (ఎంఈఐటివై) మంత్రిత్వశాఖ, భారత ప్రభుత్వము ఆధ్వర్యములో నిర్వహించబడే ఈ సెమీకాన్ ఇండియా 2025లో, పాలసీ, పరిశ్రమ, అకడెమియా, పెట్టుబడి వర్గాలలో ప్రపంచవ్యాప్త, దేశీయ వాటాదారులను కలిపేందుకు ఒక అధిక–ప్రభావము కలిగిన వేదికగా పనిచేస్తుంది. ప్రపంచవ్యాప్తంగా గ్లోబల్ సెమీకండక్టర్ డిజైన్, తయారీ ఎకోవ్యవస్థలో ఎక్సిక్యూటివ్స్, ప్రముఖ నిపుణులను ఒకచోట కలిపే సెమీ నిర్వహించే ఎనిమిది వార్షిక సెమీకాన్ ప్రదర్శనలలో సెమీకాన్ ఇండియా ఒకటి. సెమీకాన్ ఇండియా 2025 ఆశించబడిన అభివృద్ధి, తదుపరి హబ్ గా భారతదేశపు ప్రాముఖ్యతను ప్రాధాన్యీకరిస్తుంది.

**ఈవెంట్ ప్రాధాన్యతలు:**

– 18 దేశాలు/ప్రాంతాల నుండి మొత్తం ఎలెక్ట్రానిక్స్ విలువ చెయిన్ ను ప్రదర్శించే 300+ ప్రదర్శన కంపెనీలు – వస్తువులు, ఉపకరణాల నుండి సిలికాన్, డిజైన్, సిస్టమ్స్ వరకు.

– గ్లోబల్ సిఎక్సఓలు, నిపుణులైన వక్తలు పాల్గొనే 3–రోజుల సమావేశము

– 4 అంతర్జాతీయ పెవీలియన్స్, 9 పాల్గొనే రాష్ట్ర ప్రభుత్వ పెవీలియన్స్

– **ప్రత్యేక ఫీచర్స్:** శ్రామికశక్తి వికాస పెవీలియన్, అంకుర సంస్థల పెవీలియన్, 4 దేశాల రౌండ్ టేబుల్స్, బి2బి ఫోరమ్స్, శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు

"పరిశ్రమాభివృద్ధి కొరకు మా ప్రధాన సెమీకాన్ ప్రదర్శనలు, కార్యక్రమాల ద్వారా కొత్తగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో సెమీకండక్టర్ ఎకోవ్యవస్థ విస్తరణలను అనుకూల పరచే నిరూపిత ట్రాక్ సెమీకి ఉంది," అని అజిత్ మనోచ, ప్రెసిడెంట్, సీఈఓ, సెమీ, అన్నారు "చిప్ పరిశ్రమ తన సరఫరా గొలుసులలో ప్రమాదాలను–తగ్గించాలని, వేగంగా–అభివృద్ధి చెందుతున్న ఎలెక్ట్రానిక్స్ మార్కెట్స్ లో విస్తరించుటాలని కోరుకుంటుంది – అన్నీ అభివృద్ధి చెందుతున్న హబ్ గా భారతదేశములో ఆశాజనక అవకాశాలను సూచిస్తోంది.." "పరిశ్రమ నేతలు, ఆవిష్కర్తలు, పరిశోధకులు, విద్యార్థులు, పాలసీ రూపకర్తను మేము సెమీకాన్ ఇండియా 2025లో పాల్గొనాలని, భారతదేశపు సెమీకండక్టర్ పరివర్తన ప్రయాణములో భాగం కావాలని ఆహ్వానిస్తున్నాము," అన్నారు ఎస్ కృష్ణన్, సెక్రెటరీ, ఎంఈఐటివై. "భారతదేశము తన సెమీకండక్టర్ ప్రయాణములో కీలక మలుపులో ఉంది, మేము భారతదేశపు సెమీకండక్టర్, ఎలెక్ట్రానిక్స్ ఎకోవ్యవస్థ అభివృద్ధిని, ఆవిష్కరణలను వేగవంతం చేయాలని కట్టుబడి ఉన్నాము," అని అశోక్ చందక్, ప్రెసిడెంట్, సెమీ ఇండియా, ఐఈఎస్ఏ చెప్పారు. "ఈ సంవత్సరపు ఈవెంట్ సెమీకండకర్ విలువ చెయిన్ లో అభివృద్ధి చెందుతున్న హబ్ గా భారతదేశాన్ని నిలబెట్టుటలో సహాయం చేయుటకు గ్లోబల్ సెమీకండక్టర్ డైనమిక్స్ ను మార్చడం పై పెట్టుబడి పెట్టడానికి ఏర్పాటు చేయబడింది." సహకారము, అభివృద్ధి కొరకు ఒక వేదిక గ్లోబల్ సెమీకండక్టర్ ఎకోవ్యవస్థలో సహకారాన్ని వేగవంతం చేసి ఒక విశ్వసనీయమైన, అభివృద్ధిచేయగలిగే ఎలెక్ట్రానిక్స్ తయారీ హబ్ గా భారతదేశపు స్థానాన్ని పెంచాలనేది సెమీకాన్ ఇండియా 2025 లక్ష్యము. సెమీ, ఐఎస్ఎం (ఎంఈఐటివై) కలిసి నిర్వహిస్తున్న ఈ ఈవెంట్ ప్రపంచ–స్థాయి సెమీకండక్టర్ పరిశ్రమను ఏర్పాటు చేయటానికి భారతదేశము యొక్క ధృఢమైన ఆకాంక్షను సూచిస్తుంది.

## పేదరికం లేని సమాజ నిర్మాణమే పి4 లక్ష్యం



**పెదపారుపూడి జులై 21 మేజర్ న్యూస్ :** పేదరికం లేని సమాజ నిర్మాణమే పి4 లక్ష్యమని మండల పరిషత్ అభివృద్ధి అధికారిని జే విమాదేవి పేర్కొన్నారు. ఇది సెగ అందరు ఆలోచనలు సాగాలని మన కోరారు. మండల పరిధిలోని భూషణగుళ్ళ, గుర్విందగుంట, మహేశ్వరపురం, పాములపాడు గ్రామాలలో సోమవారం పి4 గ్రామసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో మండల తహసిల్దార్ శ్రీను నాయక్, డిప్యూటీ ఎంపీడీఓ వంగా శ్రీనివాస్, నియోజకవర్గ పి4 సమన్వయకర్త సౌజన్య, మహేశ్వరపురం సర్పంచ్ ఏలిరాజు, పాములపాడు సర్పంచ్ హర్షవర్ధన్, పంచాయతీ కార్యదర్శులు టీ.వి.ఎస్. ఆర్.కె.ప్రసాద్, విజయ్, చైతన్య శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, నాయకులు గోగం రామారావు, నవీన్, సుభాష్, కలుగూరి వెంకన్న, దగాని లెనిన్, దాసు రమేష్, గ్రామస్థాయి ముఖ్య శాఖల సిబ్బంది, ఆయా సచివాలయముల సహాయకులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## కంప్యూటర్ పరిజ్ఞానం పై అవగాహన



**మొవ్వ (జులై 21) మేజర్ న్యూస్:** మండల కేంద్రమైన మొవ్వ వి ఎస్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాల అధ్యాపకులు ఎస్.బి. రాఫియా, వి.సునీత ఆధ్వర్యంలో శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం కంప్యూటర్ పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. లిబ్రే ఆఫీస్ ఆటోమేషన్ తో పాటు డాక్యుమెంట్ సృష్టి, గణాంకాల నిర్వహణ, ప్రజెంటేషన్ల తయారీ వంటి అంశాలపై నైపుణ్యతను సాధించేందుకు విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## కొండపల్లి లో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలు



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** కొండపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఎన్టీఆర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొర్రా కిరణ్ స్థానిక నేతలతో కలసి కేక్ కట్ చేసి ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున్ ఖర్గే జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, క్రింది స్థాయి కార్యకర్తగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి, కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్ష పదవిని అధిరోహించడం మామూలు విషయం కాదన్నారు.ఇది ఎంతో సాధన, పట్టుదల, ప్రజా సేవకు నిదర్శనమన్నారు.ఆయన ఎదుగుదల వెనుక కాంగ్రెస్ పార్టీ పాత్ర, రాహుల్ పాత్ర ఎంతో ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ బలహీన వర్గాలకు అండగా నిలుస్తుందన్నారు. మల్లికార్జున్ ఖర్గే రాజకీయ జీవితం 1972లో తొలిసారిగా కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి గుర్మిట్కల్ నియోజకవర్గ అభ్యర్థిగా గెలిచి ప్రారంభం అయింది అని అన్నారు. 1976,78, 1990 ల వరకు కర్ణాటక రాష్ట్ర ప్రాథమిక విద్యా శాఖ మంత్రిగా,గ్రామీణ అభివృద్ధి శాఖ, పంచాయతీ రాజ్ శాఖలకు మంత్రిగా,రెవెన్యూ శాఖ మంత్రి, పలు శాఖలలో వారు ప్రాతినిధ్యం వహించటం జరిగింది.1976 నుండి 2009 వరకు పది సార్లు కూడా సాధారణ ఎన్నికల్లో పోటీ చేసి గెలిచారు.ఆ తరువాత 2014 జనరల్ ఎన్నికల్లో పోటీ చేసిన ఖర్గే బీజేపీ తరపున పోటీ చేసిన తన ప్రత్యర్థిపై 73,000ల ఓట్ల మెజారిటీతో గుల్బర్గా పార్లమెంటరీ సీటును గెలిచారు.తర్వాత జూన్ నెలలో లోక్ సభ కాంగ్రెస్ నాయకునిగా నియమితులయ్యారు.ప్రస్తుతం రాజ్య సభ ప్రతిపక్ష నాయకునిగా ఏఐసీసీ అధ్యక్షులుగా వున్నారని అన్నారు. వారి నాయకత్వం లో పార్టీ అభివృద్ధి చెందాలని,వారి ఈ దేశం కోసం చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అక్కల ప్రసాద్,రాగాల రాము, చెరుకు ఆనందరావు, కే లింగరాజు స్థానిక నేతలు పాల్గొన్నారు.

# పీఆర్సీ కమిటీని వెంటనే నియమించండి

- పెండింగ్ డిఏలు మంజూరు చేయాలి
- ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి
- చీఫ్ సెక్రటరీను కలిసిన ఏపీజేఏసీ నాయకులు





**విజయవాడ, మేజర్ న్యూస్ :** వెలగపూడి సచివాలయంలో నూతన ఎన్జీజివో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు, ఎపి జేఏసి చైర్మన్ ఎ. విద్యాసాగర్ సెక్రెటరీ జనరల్ కే ఎస్ ఎస్ ప్రసాద్ (ఏపీయూటీఎఫ్) ఆధ్వర్యంలో ఉద్యోగ ఉపాధ్యాయ, పెన్షనర్ సంఘాల నేతలు సోమవారం వెలగపూడి సచివాలయం లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, ను మర్యాదపూర్వకంగా కలిసి ఉద్యోగుల సమస్యలపై చర్చించారు.ఉద్యోగులకు సంబంధించిన పి ఆర్ సి కమిటీని వెంటనే నియమించాలని, రెండు సంవత్సరాలకు పైగా కాలాతీతం అయినందున వేతన సవరణ కమిషను వెంటనే నియమించి వేతన సవరణ ప్రక్రియని ప్రారంభించాలని కోరారు.ఉద్యోగులకు సంబంధించి మూడు డి ఏ లు పెండింగ్ ఉన్నాయని కనీసం రెండు డిఎలు అయినా మంజూరు చేయాలని కోరారు. ఉద్యోగుల సరెండర్ లీవ్ బకాయిలు తదితర వాటి మీద కూడా ప్రభుత్వం దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులపై 2019 - 24 సంవ త్సరాల మధ్య వివిధ ఆందోళనలో నమోదైన పెండింగ్ కేసులన్నీ ఎత్తివేయాలని, ఇంటీరియమ్ రిలీఫ్ చెల్లించాలని,ఉద్యోగుల సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాప్ కౌన్సిల్ మీటింగు చీఫ్ సెక్రటరీ చైర్మన్గా త్వరలోనే ఏర్పాటు చేయాలని, దానికి సంబంధించిన ప్రక్రియ కూడా ప్రారంభమైంది అన్న విషయాన్ని జేఏసీ సంఘాల నేతలు చీఫ్ సెక్రెటరీకి తెలియజేశారు.పబ్లిక్ సెక్టార్ గురుకుల ఉద్యోగులకు 60 నుంచి 62 సంవత్సరాల పదవీ విరమణ వయస్సు పెంపు, కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, పెన్షనర్లకు సంబంధించిన అడిషనల్ కౌంటం పునరుద్ధరణ, 2004 ముందు నోటిఫికేషన్ ద్వారా నియమితులైన ఉద్యోగులకు ఓపిఎస్ వర్తింపు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలు వర్తించాలని, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు తదితర అంశాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. పిఆర్సి కమిటీ ఏర్పాటు, డి ఎ, బకాయిలు చెల్లింపు అంశాలలో ఉద్యోగుల్లో ఉన్న ఆందోళన చీఫ్ సెక్రటరీగా దృష్టికి విద్యాసాగర్ తీసుకుని వచ్చారు.ఉద్యోగుల హెల్త్ కార్డుల విషయంలో ఈహెచ్ఎస్ మేనేజ్మెంట్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారని, సెక్రటరీ అధ్యక్షతన జరగవలసిన ఈహెచ్ఎస్ స్టీరింగ్ కమిటీ మీటింగ్ ని కూడా ఏర్పాటు చేయాలని కోరారు. హెల్త్ కార్డులు సమర్థ నిర్వహణకు గాను తీసుకోవలసిన కొన్ని నిర్ణయాలను ఈహెచ్ ఎస్ స్టీరింగ్ కమిటీలో తీసుకొనవలసిన అవసరం ఉన్నదన్న విషయాన్ని జేఏసీ నేతలు చీఫ్ సెక్రటరీ దృష్టికి తీసుకుని వచ్చారు. జేఏసీ నాయకులతో చీఫ్ సెక్రటరీ విజయానంద్ మాట్లాడుతూ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేయటానికి ముందు కార్యాచరణ జరుగుతుందని, డిపార్ట్మెంట్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాలు ఏర్పాటు చేశామని, ఉద్యోగులకు ఒకరోజు గ్రీవెన్స్ డే ని అమలుపరచమని ఉత్తర్వులు ఇచ్చామని, నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత 7500 కోట్ల రూపాయల్ని బకాయిల కింద చెల్లించామని, మిగిలిన అన్ని విషయాలను ముఖ్యమంత్రిగా దృష్టికి తీసుకుని వెళ్లి దశలవారీగా పరిష్కరిస్తామని, ఉద్యోగుల సంక్షేమం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో బాధ్యతగా ఉంటుందని తెలిపారు.

నూతనముగా ఏపీ ఎన్జీజివో సంఘ అధ్యక్షుడిగా, ఏపీ జెఏసి చైర్మన్గా ఎన్నికైన ఏ. విద్యాసాగర్ ను, రాష్ట్ర సంఘ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన డివి రమణను అభినందించారు.ఈరోజు వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో.. చీఫ్ సెక్రటరీ కె విజయానంద్ ని కలిసిన వారిలో రాష్ట్ర జె ఏ సి చైర్మన్ అలపర్తి విద్యా సాగర్ సెక్రెటరీ జనరల్ కె ఎస్ ప్రసాద్,ఏపి యు టీ ఎఫ్ డిప్యూటీ సెక్రటరీ జనరల్ డి వి రమణ..కో. చైర్మన్. జి హృదయ రాజు, ఏపి టి ఎఫ్ చెన్నుపాటి మంజుల, చంద్రశేఖర్.. వైస్ ఛైర్మన్ చోడగిరి శ్రీనివాస్, ఇరిగేషన్. సి పి ఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి.సి ఎం దాస్..అసిస్టెంట్ సెక్రెటరీ జనరల్ ఆర్ ఎస్.హరనాథ్, గ్రామ, వార్డ్ సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ అధ్యక్షుడు జానీ పాషా.. పశుసంవర్ధక శాఖ ఉద్యోగుల ఫెడరేషన్ చైర్మన్ సేవా నాయక్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆర్టీసీ, ఎన్ఎంయూ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజేష్ కుమార్, పశ్చిమగోదావరి జిల్లా జె ఏ సి కన్వీనర్ నెరుసు రామారావు, రాష్ట్ర ఎన్జీజీవోఎస్ అసోసియేషన్ ప్రచార కార్యదర్శి జానకి, విజయనగరం జిల్లా సహాధ్యక్షుడు కిషోర్, ఏఐఎస్జీఈఎఫ్ కన్వీనర్ రాజ్యలక్ష్మి, విజయవాడ నగర శాఖ అధ్యక్షుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# 27 కుటుంబాలకు భరోసాగా నిలిచిన పారామౌంట్ అధినేత వెనిగళ్ళ





పెనుగంచిప్రోలు, జులై 21,మేజర్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జీరో పావర్టీ పి.4 కార్యక్రమంలో భాగంగా జగ్గయ్యపేట నియోజకవర్గం పెనుగంచిప్రోలు మండలం కొనకంచి గ్రామ పరిధిలోని పారామౌంట్ కంపెనీలో పారామౌంట్ కంపెనీ అధినేత వెనిగళ్ళ సురేష్ కుమార్ సోమవారం పెనుగంచిప్రోలు మండలానికి చెందిన 27కుటుంబాలను అడాప్ట్ చేసుకున్నారు. మండల పరిధిలోని కొనకంచి గ్రామానికి చెందిన 9 కుటుంబాలను నవాబుపేట గ్రామానికి చెందిన 9 కుటుంబాలను ముండ్లపాడు గ్రామానికి చెందిన 9 కుటుంబాలను మొత్తం 27 కుటుంబాలకు ఆయన భరోసాగా నిలిచారు.. ఆ కుటుంబాల స్థితిగతులకు అనుకూలంగా వారికి అవసరమైన విద్య వైద్య ఆరోగ్య పరమైన సహకారాన్ని భవిష్యత్తులో అందించబోతున్నట్లు ఆయన ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా రాష్ట్ర ప్రజల ఆర్థిక అసమానతలు దూరమవ్వాలని, సరైన ఉపాధి, విద్య వైద్య సేవలను అందించే విధంగా, పేదరిక నిర్మూలన దిశగా ముందుకు సాగాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులతోపాటు నందిగామ డివైస్ ఓ ఎం ప్రసాద్, సి వి ఏ పి శోభ ముండ్లపాడు పంచాయతీ సెక్రటరీ శైలజ, కొనకంచి నవాపేట పంచాయతీ సెక్రెటరీ అహ్మద్ అలీ, కొనకంచి డిజిటల్ అసిస్టెంట్ రాము పారామౌంట్ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా పనులు

**వంతెనల వద్దకు చేరిన గుర్రపు డెక్క రేపటికల్లా తొలగిస్తాం**

**ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు**

**పనులు పరిశీలించిన మండలి వెంకట్రామ్**



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** రైతులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా పనులు చేయిస్తున్నట్లు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం చల్లపల్లి మండలం పుచ్చగడ్డలో చిల్లలవాగు మీడియం డ్రైనేజీ వంతెన, కొత్త మాజేరులో గుండేరు మేజర్ డ్రైనేజీ వంతెన, ఘంటసాల మండలం దేవరకోట వద్ద గుండేరు వంతెనల వద్ద గుర్రపు డెక్క తొలగింపు పనులను నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదేశాల మేరకు గుండేరు, చిల్లలవాగు వంతెనల వద్ద గుర్రపు డెక్క తొలగింపు పనులు రెండు రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. డ్రైనేజీ శాఖ అధికారులు, నీటి సంఘం ప్రతినిధుల పర్యవేక్షణలో గుర్రపు డెక్క తొలగింపు పనులు విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎక్కడ సమస్య వచ్చినా తక్షణమే స్పందించి పరిష్కారం చేస్తున్నట్లు తెలిపారు. డ్రైనేజీ శాఖ డీఈఈ జే.బాబూ నాయక్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దేవరపల్లి మీడియం డ్రైనేజీ, భీమనది మేజర్ డ్రైనేజీ, ఏనుగుల కోడు మేజర్ డ్రైనేజీ, చిల్లలవాగు మీడియం డ్రైనేజీల నుంచి మురుగు నీరు, గుర్రపు డెక్క పెద్ద ఎత్తున గుండేరు మేజర్ డ్రైనేజీలోకి వచ్చి చేరిన నేపథ్యంలో ఈ పనులు శరవేగంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, జలవనరుల శాఖ క్వాలిటీ కంట్రోల్ డీఈఈ విశ్వ కుమార్, ఏఈఈలు బీ.ఇందిరా ప్రియదర్శిని, కొప్పనాతి అజయ్ కుమార్, టీ.విజయ్ కుమార్, డ్రైనేజీ శాఖ ఏఈ చిరంజీవి, డీసీ వైస్ చైర్మన్ పరిశే చలపతిరావు, నాయ కులు బొర్రా అగ్గిరాముడు, రైతు నాయకులు వేమూరి రత్నగిరి, నాయకులు పాల్గొన్నారు.

## ద్వారావతి దాతృత్వం ఆదర్శనీయం

**ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, జులై 21, మేజర్ న్యూస్ :** ఆకలి కడుపులను నింపి.. మానవ సేవయే మాధవ సేవగా తలచి దాతృత్వంతో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ద్వారావతి ఫౌండేషన్ అందరికీ ఆదర్శనీయమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. నిత్యం ఎంతోమంది ఆకలిని తీర్చుతున్న ద్వారావతి నిత్యాన్నప్రసాద సేవ ద్వారా గత నాలుగేళ్లుగా ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్కు అర్జీలు సమర్పించేందుకు వివిధ ప్రాంతాలను వచ్చే వారికి భోజనం అందిస్తున్నారు. సోమవారం ఈ సేవా కార్యక్రమంలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పాల్గొని అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాస్థాయిలో ప్రతి సోమవారం జరిగే పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అర్జీలు సమర్పించేందుకు చాలా దూరప్రాంతాల నుంచి సైతం ప్రజలు వస్తుంటారని.. అలాంటివారు దాదాపు 200 మంది ఆకలిని తీర్చుతున్నద్వారావతి ఫౌండేషన్ సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. అన్నార్తులకు చేయూతనివ్వడంతో పాటు వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ఫౌండేషన్ వైద్య సేవలను కూడా అందిస్తోందన్నారు. ప్రతి ఆదివారం విజయవాడ, నూజివీడులో ఉచిత ఆదివారం హాస్పిటల్స్ ద్వారా, ప్రతి నెలా మెగా క్యాంపులను నిర్వహిస్తూ పేదలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు ఫౌండేషన్ చేస్తున్న కృషి చాలా ఉన్నతమైనదని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఛైర్మన్ జి.సంతోష్ కుమార్, వైస్ ఛైర్మన్ పి.సత్య, ట్రస్టీ బోర్డు సభ్యులు ఎస్.విజయ్, కుమార్, సుధాకర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య నందు చందర్లపాడు, ఇబ్రహీంపట్నం, ఏ.కొండూరు, మైలవరం, విసన్నపేట, గంపలగూడెం మండలాల్లో పని చేయుటకు విలేకరులు కావలెను.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999